“ఆయన్ని ఒకసారి పిలిపిస్తావా, అన్నయ్యా?” బల్లిలా మంచాన్ని అంటుకుని ఉన్న చెల్లెలి మొహంలోకి చూస్తున్న శ్రీధర్‌కి చేదుమాత్ర మింగినట్లయింది. తిరిగి మత్తులోకి జారిపోయినే వసంతని అలాగే చూస్తూండిపోయాడు. అప్పటి కప్పుడే వారం రోజుల్నుంచీ తెరుపు మరుపుగా ఉంది, వసంత పరిస్థితి. ఇప్పుడప్పుడే మళ్ళీ తెలివి రాదని కలత చెందిన మనస్సుతో వరండాలోకి వెళ్ళి బయటికి చూస్తూ ఆలోచనలో పడ్డాడు. చుట్టూ ఆస్పత్రి రొదలేవీ అతనికి వినిపించడం లేదు.

వసంతకి ఒంట్లో బాగాలేదు. పిల్లవాడితో చేసుకోవడం కష్టంగా ఉంది. ఎవరైనా తీసుకెళ్ళి వైద్యం చేయించమని వసంత అన్నదమ్ములు ముగ్గురికీ వేణుగోపాల్ ఉత్తరం రాశాడు. అందరి పరిస్థితులూ అంచనా వేసి తన దగ్గరకే తీసుకొస్తే మంచిదని శ్రీధర్ అభిప్రాయపడ్డాడు.

పెద్దన్నయ్య దగ్గర అమ్మ ఉంటోంది. వదిన ఆవిడనీ చూసుకోవాలీ, మళ్ళీ వసంతని చూసుకోవాలీ అంటే కష్టం. చిన్నన్నయ్య ప్రాజెక్టు ఏరియాలో ఉంటాడు. వైద్య సదుపాయం తక్కువ. తనైతే కొంచెం దగ్గరలో ఉన్నాడు. వేణుగోపాల్ వచ్చి చూసిపోతూ ఉండచ్చు అని భార్య భారతితో సంప్రదించాడు. ఆమెకూడా ఒప్పుకుంది.

“మనకి డాక్టరు, ఆస్పత్రి సౌకర్యాలు బాగున్నాయి. ఇల్లుకూడా పెద్దది. తనకి ఒక గది కేటాయించినా ఇబ్బంది ఉండదు. రమ్మని రాయండి” అంది.

అందర్లోకీ చిన్నదయిన వసంత అంటే తోబుట్టువు లందరికీ ప్రాణం. అదీగాక అయిదేళ్ళకి లేక లేక ఈమధ్యనే కొడుకుని కన్నది. అందుకని మరీ అపురూపం. ఏడాదిన్నర నిండిన రవిని, భార్యని తీసుకొచ్చి దిగబెట్టి వేణుగోపాల్ రెండు రోజులుండి వెళ్ళిపోయాడు.

శ్రీధర్, వసంత ఆఖరి వాళ్ళు అవడంతో మరీ చనువెక్కువ. చెల్లెలంటే మిగతా వాళ్ళందరికన్నా పిచ్చిప్రేమ శ్రీధర్‌కి. భారతికూడా అలాగే చూసుకునేది.

వచ్చిన వారం రోజుల దాకా “మీ ఇద్దరికీ ఇబ్బంది కలిగిస్తున్నాను వదినా. వీడితో చేసుకోలేక ఇంక రాక తప్పింది కాదు” అంది మొహమాటపడుతూ.

“అదేమిటి? పరాయి ఇల్లులాగా అలా అంటువు? అలా మొహమాట పడుతూ ఉంటే నేను ఊర్కోను సుమా” మందలించింది భారతి.

శ్రీధర్ చేయించవలసిన పరీక్షలన్నీ చేయించి, మందులు కొన్నాడు. ఇంజక్షన్లు ఇప్పించాడు. రెండు పూటలా దగ్గర కూర్చుని అన్నం తినిపించేవాడు. పథ్యరసం ఇయ్యమని భార్యను హెచ్చరించి మరీ వెళ్ళేవాడు ఆఫీసుకి.

“ఇలాగైతే కష్టమే. రేప్పొద్దున నేను వెళ్ళిపోతే ఈ చేయించుకోడాలు అలవాటై పని చెయ్య బుద్ధి వెయ్యదు” అంది నవ్వుతూ వసంత.

“బాగుంది.మీ ఆయన చేస్తాడులే- ఇలాగే జరగాలని చెప్పు.”

“జబ్బు మాట ఎలా ఉన్నా మనిషిని ఊరిపోతున్నాను.”

“లేదమ్మా. దీనికి బాగా తినాలి. బలం పడాలి. అంతేగానీ ఒళ్ళు రాదు. ఒళ్ళు వచ్చే పదార్థాలు ఏం తింటున్నావు? మీ ఇంటికి వెళ్ళి నాలుగు రోజులు పని చేసుకుంటే అదే తేలికయిపోతుంది” అని నచ్చ చెప్పేవాడు శ్రీధర్.

ఆరు నెలలు గడిచాయి. వసంత కోలుకుంది. జబ్బు లక్షణాలన్నీ చాలామటుకు తగ్గినట్టే లెక్క. మధ్యలో ఒక్కసారే వేణుగోపాల్ వచ్చి చూసి వెళ్ళాడు.

“ఆరు నెల లయింది. ఇంక నేను వెళతాను అన్నయ్యా. ఎన్నాళ్ళని ఉంటాను?” అంది వసంత ఒక రోజు.



## ఉగాది కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ

# హాస్య జ్యోతిర్మయి'

"ఎన్నాళ్ళుంటావేమిటి? పరాయి ఇల్లులాగా అలా మాట్లాడతావేమిటి? పూర్తిగా ఆరోగ్యం చిక్కద్దూ? తీరా అక్కడికి వెళ్ళాక తిరగబెడితే కష్టంకదా! ఈ స్టేజిలోనే జాగ్రత్తగా ఉండాలి. పూర్తిగా నయం అవనీ" అంటూ భారతి మళ్ళీ మాట్లాడనివ్వలేదు.

అక్కడికీ అన్న, వదినలకి తెలియకుండా "ఇంక నేను వచ్చేస్తాను. తీసుకెళ్ళండి" అంటూ ఉత్తరం రా °సింది భర్తకి.


"మీ అన్నయ్య అన్నట్టు పూర్తిగా తగ్గనీ. తీరా వచ్చాక మళ్ళీ మొదటి కొ స్తే కష్టం కదా." అని రా °సిన ఉత్తరం చూ °సి ఎందుకో వసంత మనను చివుక్కుమంది. 'ఎప్పుడు వస్తావా అని చూస్తున్నాను' అన్నట్టుగా ఏదో రాస్తారని ఎదురు చూ °సిన ఆమెకి ఆ ఉత్తరంలో అలాంటి చిహ్నాలేమీ కనిపించలేదు.

'ఎందు కిలా ఆలోచిస్తున్నాను? అన్నయ్య అన్నట్టుగానే ఆయనా రాశారు. తన ఆరోగ్యం కోసమే కదా అందరూ తాపత్రయపడుతున్నారు' అనుకొని నరిపెట్టుకుంది.

"ఏం ఫర్వాలేదు. వెళ్ళాక మాత్రం నరైన పనిమనిషిని అన్ని పనులకీ పెట్టుకో. వీణ్ణి చూసుకునేందుకుకూడా మాట్లాడుకో. అంతేగానీ వాణ్ణెత్తుకు తిరిగావంటే నీకు నీరసం పట్టుకుంటుంది. ఒక ఏడాది పాటైనా జాగ్రత్తగా ఉండాలి"అంటూ జాగ్రత్తలు చెపుతూ ఉండేది భారతి.

నిజానికి భారతి వసంత కన్నా చిన్నదే. కానీ, శ్రీధర్ వసంతని చిన్న పిల్లలా చూడటంతో భారతికీ అదే అలవాటయిపోయింది. వసంత మరీ తన ఇంటికి వెళ్ళిపోవాలని తాపత్రయపడిపోతోందని శ్రీధర్ తనంతట తనే వేణుగోపాల్‌కి ఉత్తరం రాశాడు చెల్లాయి ఆరోగ్యం కుదుటబడిందని, వారం పది రోజుల్లో వచ్చి తీసుకెళ్ళమని, లేకపోతే తనే తీసుకువస్తానని.

దానికి సమాధానంగా తనకి ఆఫీసులో చికాకులు వచ్చాయని, అందువల్ల బిజీగా ఉన్నానని, తరవాత ఉత్తరం రాస్తానని రాశాడు వేణుగోపాల్. శ్రీధర్ ఊరుకున్నాడు నిజమే అయి ఉంటుందని. పదిహేను రోజులయినా మళ్ళీ ఏ ఉత్తరం రాలేదు. వసంతకి అసహనంగా ఉంది. అన్నయ్య, వదిన ఎంత బాగా చూ °సినా తన ఇల్లు తనదే. ఇల్లు వదిలే °సి ఎన్నాళ్ళైందో, ఎప్పుడు వెళ్తానో ఏమిటో అన్న ఆలోచనలతో వసంతకి ఉత్సాహం తగ్గిపోయింది.



ఇంకో నెల రోజులు గడిచాయి. రవిని భారతి తెగ ముద్దు చేసేది. ఎత్తుకు దించేది కాదు. వాళ్ళకి ఇంకా పిల్లలు లేరు.

"నాతోపాటే వాడికీ ఈ రాజభోగం అలవాటయిపోతోంది. అక్కడికి వెడితే మా ఇద్దరి పనీ అవుతుంది" అనేది వసంత నవ్వుతూ.

చెల్లెలి ఉదా °సనత చూ °సి, "నువ్వు సరిగ్గా తిండి తినడం లేదు మళ్ళీ. ఇలా చేస్తే నేను అసలు పంపించను. ఇక్కడే నా మాట వినడం లేదు, అక్కడి కెళ్ళి ఏం చేస్తావు? వస్తారులే. అంత బెంగ పెట్టుకుంటావేమిటి? ప్రమోషన్ అదీ రావాల్సిన టైము? అలాంటప్పుడు ఏవో చికాకులు వస్తుంటాయి" అన్నాడు శ్రీధర్.

"ఏమో! నా కేం తెలియదు. ఆయన రావడం లేదు, నువ్వు పంపించడం లేదు. ఈ పరస చూ స్తే నే నిక్కడే ఉండిపోయేట్టుంది." ఏదో తెలియని వినుగుతో ఏం మాట్లాడుతూందో తెలియడం లేదు వసంతకి. భర్త దగ్గర్నుంచి ఉత్తరం లేకపోవడంతో మనసు బాగాలేదు.

ఆమె మాటలకి మనస్సు చివుక్కుమన్నా, భారతి నవ్వే °సి, "అవేం మాటలు? ఆఫీసు వదిలి ఆయనకి రావడం కుదరటం లేదు. వీలవగానే

వస్తానని రాశారుగా?" అని ఊరడించడానికి ప్రయత్నించింది.

"ఏమో వదినా. నా కేం తోచడం లేదు. ఇంకొన్నాళ్ళు ఇలాగే సస్పెన్స్‌తో ఉంటే మీ రిన్నాళ్ళు చే సిన ప్రయత్నాలన్నీ వృథా అయిపోతాయి. నా కసలు అన్నంకూడా సయించడం లేదు."

శ్రీధర్ ఏదో అనబోయేంతలో, భారతి కళ్ళతో వారించింది. వసంత లేని సమయంలో, "తనని ఏమీ అనకండి. ఇన్నాళ్ళయింది. ఎవరికయినా అలాగే ఉంటుంది. పాపం.'మనం ఏమన్నా అంటే ఇంకా బాధ పడుతుంది. అయినా, ఆయన ఎందుకు ఉత్తరం రాయలేదంటారు?" అంది.

"నాకు మాత్రం ఏం తెలుసు? మళ్ళీ రా సి చూస్తాను" అని ఇంకో ఉత్తరం రాశాడు. దానికీ సమాధానం రాలేదు.

"అయినా, ఆయన ఆఫీసులో చికాకులకి, నేను వెళ్ళడానికి సంబంధం ఏమిటన్నయ్యా? నువ్వు రెండు రోజులు సెలవు పెట్టి నన్ను దిగబెట్టెయ్యి. వెళ్ళిపోతాను" అంది వసంత తను రా సిన ఉత్తరానికికూడా సమాధానం రాకపోయేసరికి. "ఒంట్లో బాగాలేదేమిటో? నాకు కంగారుగా ఉంది" అని భయపడింది.

"ఒంట్లో బాగాలేకపోతే ఊరు గొడ్డుపోయిందా? నోరు లేదా? అంత ఉత్తరం రాయలేనంతగా చేతులు పడిపోతాయా?" చికాగ్గా అని, వెంటనే చెల్లెలు ఏమనుకుంటుందో అని తమాయించుకుని, "నువ్వన్నట్టు సెలవు పెడతాను. కానీ, నేను చూ సి వస్తాను. పరి స్థితులు తెలియకుండా నిన్ను అక్కడ దిగబెట్టి ఇబ్బంది పెట్టలేను. విషయం తెలుసుకుని వస్తాను" అన్నాడు.

వసంత ఏదో అందామని అనుకుంది గానీ, భారతి అడ్డుకుంది. "అలాగే చెయ్యనీ వసంతా! నిజంగా ఒంట్లో బాగాలేకపోతే నువ్వు చే సి హైరాన పడిపోతఅవు. ఇన్నాళ్ళూ ఉన్నదానివి ఇంక నాలుగు రోజులు ఓపిక పట్టు. ఆయన్ని వెళ్ళి రానీ" అంది.

వాళ్ళ మాటల్లో కొంత సబబు కనిపించి ఊరుకుంది వసంత. "వెళ్ళగానే ఏమాత్రం నులువుగా ఉన్నా, టెలిగ్రామ్ ఇయ్యి అన్నయ్యా. నేను ఒక్క దాన్నీ వచ్చేస్తాను" అంది.

ఇప్పటినుంచీ తనతో తగువెందుకని "అలాగే" అని బుర్ర ఊపాడు శ్రీధర్.

×× ×× ××

రైలు చేరేసరికి సాయంత్రం అయింది. ఆ సమయంలో ఇంట్లోనే ఉంటాడని ఉత్తరం రాయలేదు శ్రీధర్. అయినా సమాధానమే రాయని మనిషికి వస్తున్నానని తెలియజెయ్యడంలో అర్థం కనిపించలేదు శ్రీధర్‌కి. అంతకు ముందు ఎప్పుడో ఒకసారి వచ్చి రెండు రోజులు ఉన్నాడు వాళ్ళ ఇంట్లో. క్వార్టర్సుకి తాళం వే సి ఉంది. ఏం చెయ్యాలో తోచక పక్క ఇంటికి వెళ్ళాడు. కాలింగ్ బెల్ నొక్కాడు.

"ఎవరూ!" అంటూ వచ్చి తలుపు తీ సిన ఆవిడ ఎవరో కొత్తవాళ్ళని కొంచెం వెనక్కి తగ్గింది.

"పక్క క్వార్టరులో వేణుగోపాల్‌గారు ఇంట్లో లేరాండీ? ఎక్కడి కెళ్ళారో మీకు తెలుసా?" అన్నాడు.

"ఎవరు సుజాతా?" అంటూ లోపల్నించి వచ్చిన వ్యక్తిని చూ సి, "వేణుగోపాల్‌గారి కోసం వచ్చారు ఎవరో?" అంది. అతను ముందుకొచ్చాడు.

"మా సిస్టర్ వేణుగోపాల్ భార్య వసంత. మీకు తెలి సే ఉంటుంది. ఆయన ఇంట్లో లేరు. ఎక్కడి కెళ్ళారు?" అన్నాడు మళ్ళీ శ్రీధర్.

"ఐ సి" అంటూ అతను ముందు కొచ్చాడు. శ్రీధర్‌తో చెయ్యి కలిపి, "అయామ్ శర్మ. రండి లోపలికి. ఇప్పుడే ట్రెయిన్ దిగినట్టున్నారు. కొంచెం రిఫ్రెష్ అవండి ముందర. బాత్‌రూమ్ చూపిస్తాను" అన్నాడు. అతని మర్యాదలకి ఏం అనాలో తెలియలేదు శ్రీధర్‌కి.

సూట్‌కేసులోంచి తువ్వాలు, సోపు తీసుకుని బాత్‌రూమ్‌కి వెళ్ళాడు. నిజంగానే చికాకుగా ఉంది రైలు ప్రయాణంతో. అందులో అతను ఇంట్లో లేడంటే మరీ ఎక్కువయింది. వీళ్ళు తిన్నటి సమాధానం చెప్పడం లేదు. ఆలోచిస్తుంటే శ్రీధర్‌కి ఏదన్నా జరగరానిది జరగబోతోందా అన్న అనుమానంతో వెన్ను జలదరించింది. హాల్లోకి తిరిగి వచ్చేసరికి ప్లేట్లలో ఉప్మా ఉంది వేడిగా.

"ఇదేమిటండీ? అనవసరంగా ఆవిడకి ట్రబుల్ ఇస్తున్నారు. ఆయన వస్తారేమో నేను ఎలాగూ వెళ్ళిపోతాను. కొంచెం సేపు కూర్చుని" అన్నాడు మొహమాటంగా.

"దానిదేముందండి? నేనూ తీసుకుంటాను మీతో. నాకూ టైమే" అంటూ బలవంతం చేశాడు. ఉప్మా తింటూ ఇంక లాభం లేదని, "వేణుగోపాల్ ఊళ్ళో ఉన్నాడా అసలు? ఆఫీసులో ఏవో చికాకులు ఉన్నాయిట. ఉత్తరంలో రాశారు. అందుకనే మా సిస్టర్‌ని తీసుకురాలేదు. చూ సిపోదామని వచ్చాను. తన ఆరోగ్యం ఇప్పుడే కదా కోలుకుంది" అన్నాడు ఏం మాట్లాడాలో తెలియక.

"ఆహా! అలాగని రాశారా?" అన్నాడు శర్మ. అతని మాటల్లో ఏదో అపనమ్మకం వినిపించింది. కాఫీ తీసుకొచ్చి బల్లమీద పెట్టి వెళ్ళిపో తుంటే "నువ్వూ తెచ్చుకుని ఇక్కడే కూర్చో సుజాతా!" అన్నాడు శర్మ.

ఆవిడ అతని వైపు భావగర్భితంగా చూ సి, లోపలికి వెళ్ళి కాఫీ తీసుకుని వచ్చి అక్కడే కూర్చుంది. శ్రీధర్‌కి కొంచెం కంగారు పుట్టింది.

"వసంతగారి ఆరోగ్యం బాగుందా? రవి ఎలా ఉన్నాడు?" అంది ఆమె.

"బాగున్నది ఇప్పుడు. అందుకనే వచ్చేస్తానని ఒకటే పేచీ పెడుతూంది. రవికి మాదగ్గర చాలా చనువు అయిపోయింది. మా ఇద్దరినీ అసలు వదలడు" అన్నాడు. కాఫీ పూర్తి చే సి, "ఆయన వచ్చారేమో చూస్తాను" అంటూ లేవబోతుంటే "లేదులెండి. వ స్తే స్కూటర్ చప్పుడు, గేటు చప్పుడు వినిపిస్తాయి" అన్నాడు శర్మ.

"ఇంత సేపు ఎక్కడికి వెడతారు? ఈమధ్య ఉత్తరంకూడా లేదు. ఒంట్లో బాగాలేదో ఏమిటో అని మా చెల్లెలు ఒకటే కంగారు పడిపోతూంది. ఇంక లాభం లేదని నేనే వచ్చాను. అలాంటిదేమీ లేదు కదా?" అన్నాడు. వాళ్ళిద్దరూ మొహాలు చూసుకున్నారు.

"ప్లీజ్, ఏదన్నా ఉంటే చెప్పండి. మీ మొహాలు చూ స్తే నాకు భయం వేస్తూంది" అన్నాడు గాబరాగా.


"నువ్వు చెప్పు సుజాతా!" అన్నాడు శర్మ నెమ్మదిగా. సుజాత తడబడి తేరుకొని, "మీరు ఎంతో ఆశతో వచ్చారండీ. నాకు చెప్పాలంటే నోరు రావడం లేదు. ఏ అన్నగారూ ఇలాంటి మాట వినలేదు. వేణుగోపాల్‌గారు చాలా మారిపోయారు. వాళ్ళ ఊరి అమ్మాయి ఎవరికో ఇక్కడ టీచరుగా ఉద్యోగం ఇప్పించి, చాలా చనువు పెంచుకున్నారు. కొన్నాళ్ళు ఏదో మామూ లు పరిచయం అనుకున్నాము గానీ, ఈమధ్యనే బట్టబయలయిపోయింది. ఆవిడ ఇక్కడే ఉంటుంది రెండే సి రోజులు. ఎవరితోటో ఆవిడని పెళ్ళి చేసుకుంటాను అనికూడా అన్నారట. చే సేసుకున్నారేమో అని నా అనుమానం. ఇలాగే కొన్నాళ్ళు వసంతగార్ని దూరంగా ఉంచి, ఒంట్లో బాగుండటం లేదని కారణం చెప్పి సానుభూతికూడా సంపాదిద్దామని అనుకుంటున్నారు. ఇప్పటికీ అందరితో రోగమేమిటో అంతు పట్టడం లేదని చెప్తున్నారు."

శ్రీధర్ కాలికింద భూమి కదిలిపోయినట్లయింది. ఉప్మా, కాఫీ బయటకు వచ్చేస్తాయేమో అని అనిపించింది పేగులు తెంచుకుని.

"ఇదంతా నిజమాండీ? మీ అనుమానమేనా?" అన్నాడు అయోమయంగా.

"అనుమానమే అయితే, మాకూ సంతోషమే నండీ. కానీ, నిజం. ఈ వీథిలో ఎవరినన్నా అడగండి కావలి స్తే" అంది సుజాత.

"ఏమిటండీ ఈ ఘోరం? దాని కేమంత చచ్చేంత రోగం వచ్చిందని ఇంకొ కళ్ళని కట్టుకోడానికి? మధ్యలో అతనే వచ్చి చూశారు. ఇదంతా చూస్తూ ఊరుకోవల సిందేనా? ఎప్పటినించో తహతహలాడిపోతోంది దాని ఇంటికి అది రావాలని. ఒంట్లో బాగాలేదో ఏమిటో అని అది అక్కడ కొట్టుకుపోతుంటే ఇక్కడ ఇతను రాసక్రీడలు ఆడుతున్నా



ఇప్పుడు తెలుస్తోంది" అన్నాడు శర్మ.

ఆటో ఒక ఇంటి ముందు ఆపించాడు. "నే నిక్కడే ఉంటాను. అదిగో అయిదో నంబరు ఇల్లు" అన్నాడు. శ్రీధర్ ఆ ఇంటి వైపు వెళ్ళి తలుపు తట్టాడు. ఒకమ్మాయి తలుపు తీసింది. తన చెల్లెల్ని కాదని ఆ అమ్మాయిలో ఏం చూశాడో అర్థం కాలేదు శ్రీధర్‌కి.

"ఎవరు మీరు?" అంది.

"నేను వేణుగోపాల్ బావమరిదిని. వసంత నా చెల్లెలు" అన్నాడు నెమ్మదిగా.

"అలాగా! ఏం పనిమీద వచ్చారు?" అంది బింకంగా.

"లోపలికి రానివ్వండి. వీధిలో మాట్లాడుకునే ంత ముచ్చటయిన వ్యవహారం కాదని మీకూ తెలును" అంటూ లోపలికి దారి తీశాడు. "మీరేం చేస్తున్నారో మీరు తెలిసే చేస్తున్నారా? మీలాగే నా చెల్లెలు కూడా ఒక ఆడది అన్న విషయం మరిచిపోయారా? ఏ తప్పూ చెయ్యనిదాన్ని ఎందుకిలా ఇద్దరూ కలిసి చిత్రహింస పెడుతున్నారు?"

"ప్లీజ్, ఈ విషయం నాతో మాట్లాడకండి" అంది.

"అఁ...ఆయనతో మాట్లాడే వచ్చాను. సాటి ఆడదాని బాధ మీరు అర్థం చేసుకోగలరనే ఆశతో వచ్చాను."

"చూడండి. నావే అస్తవ్యస్తమైన పరిస్థితులు. ఇంకొకళ్ళ కష్టాలు అర్థం చేసుకునే ఓపిక నాలో లేదు. పదిమంది సంతానంలో ఒక దాన్నయిన నేను ఇన్నాళ్ళూ ఏ సుఖమూ పొందలేదు. నా కష్టాలు ఎవరూ అర్థం చేసుకోలేదు. ఉద్యోగం ఇప్పించి సాయపడ్డారు ఆయన. అభిమానించి చేరదీశారు. పెళ్ళైన ఆయనకే అభ్యంతరం లేనప్పుడు నా కేమిటి? ఇంకెవరన్నా చేసుకుంటారు నిన్ను అంటారేమో! కానీ నా కిలా ఆసరా ఇచ్చి నిలబెట్టిన ఆయన్ని కాదనలేను. అయినా వసంత గారికి వచ్చిన కష్టమేమిటి? ఆవిడ వచ్చి ఆ ఇంట్లో ఉండచ్చు. నాకేమీ అభ్యంతరం లేదు. కాకపోతే మేము ఇద్దరంమాత్రం ఇలాగే ఉంటాము."

మళ్ళీ అదే మాట. శ్రీధర్ ఆవేశం మళ్ళీ కట్టలు తెంచుకుంది.

"ఏం త్యాగమూర్తులు తల్లీ మీ ఇద్దరూ! నా చెల్లెలు సంసారాన్ని దానికే ముష్టి వేస్తారా? నీ దయాధర్మం మీద అది ఆధారపడాలా? అది ఆత్మాభిమానం ఉన్న ఆడది. నీలాంటి బురద మనిషి కాదు. ఇంతోటి మొగుడూ లేకపోయాడని మీ కాళ్ళ దగ్గర పడి ఉండాలా? బాస్టర్డ్స్! అది నా చెల్లెలు. మనిషిలా బ్రతుకుతుంది. నీలా కుక్కలా ఇంకొకళ్ళ ఎంగిలిలో నోరు పెట్టదు" అని నోటికొచ్చినట్టు మాట్లాడి వెళ్ళిపోయాడు.

అతనిలో ఆవేశం ఇంకా చల్లారలేదు. ఏదో బాధ గుండెలో ఉండకట్టుకొనిపోయి ఉంది. ఏదో చెయ్యాలని కసిగా ఉంది. శర్మ అతణ్ణి చూసి పరిస్థితి ఊహించాడు. భుజం తట్టాడు.

** ** **

ఇంటికొచ్చిన శ్రీధర్ మొహం చూసి భారతి భయపడిందిగానీ, బయటికి తెలియనివ్వలేదు. వసంతమాత్రం "ఏమిటన్నయ్యా! తొందరగా వచ్చేశావు?" అంది.

"అవునమ్మా! అతణ్ణి పనిమీద ఆఫీసు వాళ్ళు ఊళ్ళు తిప్పుతున్నారు. ఇరవై రోజులు అలా ఉండిపోవలసి వస్తోందట. ఆయన లేరు. పక్క వాళ్ళు చెప్పారు. అందుకనే నిన్ను తీసుకెళ్ళటం ఇష్టం లేకపోయి ఉంటుంది" అన్నాడు సాధ్యమైనంత నెమ్మదిగా. పాపం వసంత నమ్మింది.

రోజులు గడుస్తున్నాయి. రవి అక్కడ బాగా అలవాటుపడిపోయాడు. "వీ డసలు నాన్నని తలవడమే మానేశాడు. మీ రిద్దరు ఉంటే చాలు, నా దగ్గరికి కూడా రావడం మానేశాడు. ఎవరైనా చూస్తే మీ అబ్బాయే అనుకుంటారు" అంది వసంత నవ్వుతూ. "అయినా అన్నయ్యా! ఆయన ఊళ్ళు తిరగడానికీ, నేను వెళ్ళడానికీ ఏమిటి సంబంధం? మీ ఇద్దరిదీ చాదస్తం. ఆయనా అలాగే చేస్తున్నారు. ఉత్తరమన్నా లేదు."

"ఎక్కడో పరాయి చోట ఉన్నట్టు మాట్లాడుతున్నావేమిటి? ఉత్తరం ఏమని రాస్తారు చెప్పు. పాపం! నువ్వు ఇంకా బాధపడతావని ఊరుకున్నట్టున్నారు, పాపం! ఇంకేమీ ఆలోచనలు పెట్టుకోకు" అని భారతి సమర్థించ ప్రయత్నించేది.

కానీ వసంతమాత్రం డల్‌గానే ఉంది. మునుపటి ఉత్సాహం లేదు. తిండిమీద కూడా ధ్యాస తగ్గిపోయింది. రోగం ఎక్కడ తిరగబెడుతుందో అని శ్రీధర్‌కి భయంగా ఉంది.

ఒక రోజు అలాగే యాథాలాపంగా, "ఏమిటన్నయ్యా! ఇన్నాళ్ళైపోయింది. అసలు నా ఇంటికి ఎప్పటికయినా వెడతానా అని భయంగా ఉంది" అంది వసంత.

"ఇక అది నీ ఇల్లు కాదమ్మా!" అనేశాడు శ్రీధర్.

"మీకేమన్నా మతి పోయిందా? ఏమిటా మాటలు?" అంది భారతి గట్టిగా.

"ఊరుకో భారతీ! ఈ మంట నేను భరించలేను. ఎప్పటికయినా దానికి తెలియవలసిందే."

"ఏమి టన్నయ్యా! ఏమిటి అంటున్నావు? ఆయనకేమీ అవలేదు కదా!"

"పిచ్చిపిల్ల! ఇంకేం ఆయన? ఎవతెనో తెచ్చి పెట్టుకున్నాడు." వసంత బిత్తరచూపులు చూసింది. "ప్రమీలట. విన్నావా ఆ అమ్మాయి గురించి ఎప్పుడన్నా?"

"అఁ...ఒకసారి ఉత్తరం రాసింది. వాళ్ళ ఊరి అమ్మాయి- సాయం చెయ్యమని. ఈయన వెళ్ళారు కూడాను. ఊరికే వచ్చిందేమో అన్నయ్యా సాయంకోసమని".ఏ ఆశో ఇంకా పీకుతోంది.

"లేదమ్మా! అలాంటి నమ్మకాలు పెట్టుకోకు. ఇద్దరితోనూ మాట్లాడాను. నువ్వు వచ్చి ఉంటే అభ్యంతరం లేదట. కానీ ఆవిణ్ణిమాత్రం వదలడట" అంటూ జరిగిన విషయమంతా చెప్పుకొచ్చాడు.

పూర్తయేలోపలే వసంత గిరుక్కున లోపలికి వెళ్ళిపోయింది. "ఎలాగండీ! ఏమన్నా అఘాయిత్యం చేస్తుందో ఏమిటో?" అంది భారతి భయంగా.

"ఏం చెయ్యమంటావు భారతీ! దీని కేమిటి పరిష్కారం? చేస్తే చెయ్యనీ. ఇక దాని జీవితంలో ఏం ఉంది? ఏ ఆశతో బతుకుతుంది?" అన్నాడు బాధగా శ్రీధర్.

ఆ రోజంతా వసంత బయటికి రాలేదు. ఇద్దరికీ ధైర్యం చాలలేదు ఊరడించడానికి. రాత్రయ్యాక భారతి వెళ్ళి, "వసంతా- లేమ్మా! కొంచెం అన్నం తిను" అంది ఏదో ఒకటి అనాలని.

"వదినా!" అంటూ బావురుమంది. "ఇంక అన్నం తిని నేనేం చెయ్యను? ఎందుకు బతకాలి? నాలో ఏం తక్కువయింది వదినా? నన్నెందుకిలా చేశారు?"


ఎలా ఊరుకోబెట్టాలో తెలియలేదు భారతికి. అలా వెక్కుతూనే ఎప్పటికో భారతి ఒళ్ళో నిద్రపోయింది.

అన్న లిద్దరినీ రమ్మని రాశాడు శ్రీధర్. విషయం అంతా వివరించి ఏం చెయ్య మంటారని అడిగాడు.

"ఏం చెయ్యడ మేమిటిరా? రాస్కెల్‌ని కోర్టుకి ఈడుస్తాను. ఇలా ఊరుకుంటే లాభం లేదు" అన్నాడు శ్రీహరి.

"ఎందుకన్నయ్యా ఇవన్నీ? నా మీద ఏమాత్రం అభిమానం ఉన్నా ఇవన్నీ వదిలెయ్యండి. ఇప్పటికే ఈ అవమానం భరించడం నా తరం కావడం లేదు. ఇంకా నలుగురిలో పడాలా? కోర్టు వాళ్ళు తీర్పులు ఇవ్వగలరు కానీ, కాపురాలు చేయించగలరా? నేను తిరిగి ఆయన దగ్గరకి వెళ్ళేంత సిగ్గులేనిదాన్నా? ఇంకా అయితే నాకు భరణం ఇప్పిస్తారేమో! అంతేగా! ఆమాత్రం నాకూ, రవికీ అన్నం పెట్టలేరా మీరు? నే నెక్కువ తినను అన్నయ్యా! నా కసలు బతకాలనే లేదు. తిండి తిని ఒళ్ళు పెంచి ఏం చెయ్యాలని?" హృదయ విదారకమైన ఆ మాటలకి అందరూ చలించిపోయారు.

"లేదమ్మా! అలాంటి మాట లనకు. ఇంక వాడి మాట ఎప్పుడూ ఎత్తము మేము. ఇదిగో వీడికి అమ్మవి, మాకు చెల్లెలివి- అంతే" అని ఊరడించారు.



"అమ్మ గోల పెడుతోందిరా, అది ఎలా గుందని?" శ్రీహరి అన్నాడు శ్రీధర్‌తో.

"ఏదో సమాధానం చెప్పు మరి. ఈ అవతారంతో దాన్ని ఎలా చూపిస్తాము? నేనే ఏవో ఉత్తరాలు రాస్తుంటాను అది రాసినట్టు" అన్నాడు శ్రీధర్.

ఎవరి ప్రమేయమూ లేకుండా రోజులు ఘోరంగా తలకిందులయ్యాయి. ఏ ఆశ చూపించి మునుపటిలా అన్నంతినమని బలవంతం చెయ్యగలడు? కొడుకుని కూడా చూసుకోవడం మానేసింది. నిర్లిప్తంగా అయిపోయింది. ఒకవేళ వసంతని, రవిని అక్కడికి పంపించేసి ఉంటే కొన్ని రోజు లయ్యాక అతను మారి, ఆవిడని వదిలేసేవాడేమో అన్న ఆలోచన వచ్చింది శ్రీధర్‌కి.

"ఈ సమస్యని నా కోణంలోంచే చూశానేమో! అప్పట్లో నువ్వు, రవి వెళ్ళి ఉంటే అతను మారిపోయే వాడేమోనమ్మా!" అన్నాడు వసంతతో.

"సమస్యని ఏ కోణంలోంచి చూసినా దాని ఆకారం ఒకటే అన్నయ్యా! నే నా ఇంట్లో ఉండి ఎలా భరించగల నన్నయ్యా! ఆవిడకి రేప్పొద్దున్న పిల్లలు పుట్టొచ్చు. వాళ్ళ గురించి ఆయన తాపత్రయ పడుతుంటే వీడిని చూస్తూ నే నెలా భరించగలను? కొన్నాళ్ళు పోయాక ఆవిడని కూడా ఇంట్లోకి తెచ్చే ధైర్యం వస్తుంది. ఆయన అన్నట్లు ఈ రోజుల్లో చాలామంది ఇలాంటివి భరిస్తున్నారు పాపం, పిల్లలకోసమనో, మరెందుకనో. నీ అండే లేకపోతే నేనూ అంతేకదా! లేకపోతే నాలో ఉన్న గొప్పతనమేమిటి?"

"ఎందుకలా అయిపోతావు? అతను కాదంటే నీ జీవితం అయిపోయిందా? ఎక్కడున్నా ఉద్యోగానికి ప్రయత్నిస్తాను. కాలక్షేపం చేసుకోమ్మా! ధైర్యంగా నిలబడగలనని నిరూపించుకో."

"ఎవరికోసం అన్నయ్యా అవన్నీ? ఇంట్లోనే నాకు తలెత్తుకో లేకుండా అయింది. గుమ్మం దిగి నలుగురిలోకి నేను వెళ్ళలేను. నేను చాలా మామూలు ఆడదాన్ని, అన్నయ్యా! భర్త, పిల్లలు, సంసారం-వీటితో బ్రతికెయ్యాలని అనుకున్నాను. అలాంటిది చిత్తు కాగితాన్ని ఉండచుట్టి పారేసినట్టు పారేశారు నన్ను. అంతకన్నా అవమానం ఏం కావాలి? నేను భరించలేకుండా ఉన్నాను."

ఆ మాటలకి ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు శ్రీధర్‌కి. ఆ రోజుల్లోనే భారతి నెల తప్పింది. అయిదో నెల నుంచీ డాక్టరు సలహా ప్రకారం విశ్రాంతి తీసుకోవలసి వచ్చింది. వసంతే చేసింది ఆమెని మంచం దిగనియ్యకుండా. పురిటికి వెళ్ళకూడదని అనుకుందిగానీ, వసంత బలవంతం చేసి పంపించింది, "నా గోల ఎప్పుడూ ఉండేదే. కొన్నాళ్ళయినా మీ వాళ్ళతో సంతోషంగా గడిపిరా" అని. తమ ఇద్దరికీ సాయంగా అక్కని పిలిపించుకున్నాడు శ్రీధర్.

ఒకోసారి నిద్రపోతున్న రవిని చూసి, "ఎంత దురదృష్టవంతుడు వీడు! నాన్న ఉండీ లేనివాడయ్యాడు. అమ్మ అసలు పట్టించుకోవడం మానేసింది" అనేవాడు శ్రీధర్.

"అలా అనకు అన్నయ్యా! వాడు చాలా అదృష్టవంతుడు. తండ్రిలా చూసుకునే మావయ్య, తల్లిలా ఆదరించే అత్త ఎక్కడ దొరుకుతారు?" అని నవ్వేది వసంత.

మూడో నెల వచ్చాక పాపని ఎత్తుకు వచ్చింది భారతి. వసంత కళ్ళలో ప్రాణాలు పెట్టుకుని ఉంది. "అదేమిటండీ! అలా ఊరుకున్నారు? మీరేమన్నా గమనిస్తున్నారా?" అంది కంగారుగా.

రవి భారతికి బాగా చనువయిపోయాడు. ఆమె వచ్చిన మూడు నెలలకే ఒకరోజు వసంత కళ్ళు తిరిగి పడిపోయింది. డాక్టరు ఆస్పత్రిలో చేర్పించమన్నాడు. దగ్గుకూడా ఎక్కువయింది. బతుకుదామన్న ఇచ్ఛ లేనప్పుడు ఏ మందుమాత్రం ఏం పనిచేస్తుంది? చూస్తూ చూస్తూ ఏమీ చెయ్యలేని శ్రీధర్‌కి తనమీద తనకే అసహ్యంగా ఉంది. రోజుల్లో పడింది పరిస్థితి అని తెలుస్తూనే ఉంది. బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్న చెల్లెల్ని శ్రీధర్ అక్క, భార్యలతో వంతులు వేసుకుని కాపలా కాస్తున్నాడు.

"నాకోసం బాధపడకు అన్నయ్యా! ఇద్దర్నీ ఎన్నాళ్ళని భరిస్తావు? రవినిమాత్రం నీ కొడుకులా పెంచాలి. ఆడపిల్ల అయితే గుండె మీద కుంపటి అవుతుంది. కానీ మగపిల్లవాడు గదా- పెద్దయితే ఆసరా అవుతాడు" అనేది.

×× ×× ××

తెలివి వచ్చిందేమో అని చెల్లెలి దగ్గరకి వచ్చాడు శ్రీధర్. ఆలోచనల బరువుతో తల దిమ్ముగా ఉంది. కళ్ళు తెరిచిన వసంత మళ్ళీ "ఆయన్ని పిలిపిస్తావా, అన్నయ్యా!" అంది. ఏమీ అనడానికి నోరు రాలేదు శ్రీధర్‌కి. "ఈ ఆడవాళ్ళ సెంటిమెంట్ల మూలంగానే భార్యాభర్తల సంబంధం జన్మజన్మల అనుబంధం అంటూ కవిత్వం రాస్తారు. కొన్ని ఏళ్ళు కూడా నిభాయించుకోలేక పోయారు" అనుకున్నాడు. భారతి దెబ్బలాడింది.

"తనే పిలిపించమంటూ ఉంటే మీ రేమిటి మధ్యన పంతం పడతారు? ఆ తరవాత మళ్ళీ బాధపడతారు జీవితాంతం" అంది. అయిష్టంగానే టెలిగ్రామ్ ఇచ్చాడు. నాలుగో రోజు పొద్దున్నే దిగాడు వేణుగోపాల్. "ఎలా ఉంది వసంతకి?" అన్నాడు.

"ఇవాళో, రేపో అన్నట్టుంది" తిన్నాడు వెటకారంగా శ్రీధర్.

"మరి ఇంత లేటుగా ఇచ్చావేం టెలిగ్రామ్?"

"నేనేమీ ఇయ్యలేదు. ఇయ్యమని అంటే ఆఖరి గడియల్లో ఉంది కదాని దాని మాటకి ఎదురు చెప్పలేక ఇచ్చాను. అంతేకానీ నువ్వు రావడం నాకిష్టం లేదు" అన్నాడు.

వేణుగోపాల్ మాట్లాడలేదు. రవిని కావాలనే అతనికి చూపించలేదు శ్రీధర్. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్ళాడు. తను అపోహపడినట్టుగా భర్తని చూడగానే వసంత మొహం వికసించలేదు. నీరసంగా "వచ్చారా? ఎలా ఉన్నారు? పోనీ మీరు కోరుకున్న ఆనందం మీకు దొరికిందిగదా!" అంది.

అతను ఏమీ మాట్లాడలేదు. శ్రీధర్ వైపు చూసి, "నీకు కోపం వచ్చిందా అన్నయ్యా! నే నెందుకు పిలిపించా ననుకున్నావు? ఒక్కసారే గదా చచ్చిపోతాం. మళ్ళీ ఈ అవకాశం వస్తుందా? ఆయన ఆనందంకోసం చిత్తుకాగితంలా పారేసిన ఈ వసంత ఎలా చచ్చిపోతుందో చూపించాలని పిలిపించాను. ఈ ఆనందంకూడా కలిగిద్దామని" అంది.

శ్రీధర్ కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. ఆ రోజు వసంత పరిస్థితికి భయంవేసి అతను ఇంటికి కూడా వెళ్ళలేదు. చీకటి పడుతుంటే "వదిన్ని ఒక్కసారి రమ్మను అన్నయ్యా!" అంది.

"అదేమిటమ్మా, ఇప్పుడే కదా వెళ్ళింది?" ఇంట్లో పిల్లల్ని చూసుకోవాలని రాత్రికి ఆడపడుచుని పంపిస్తుంది భారతి.

"లే దన్నయ్యా! ఇంక ఎంత సేపో ఉండనేమో! నా కాళ్ళు లాగేస్తున్నాయి. ప్రాణం అంతా కిందకి జారిపోతున్నట్టుంది. వదిన్ని చూడాలని ఉంది" అని కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

"ఇప్పుడే వస్తాను. రవినికూడా తీసుకు వస్తాను."


"వద్దన్నయ్యా! వాడిని చూస్తూ న ప్రాణం పోవడానికి కష్టపడుతుంది." కానీ శ్రీధర్ ఊరుకోలేకపోయాడు. తిరిగి వచ్చేసరికి చాలా ఆలస్యం అయింది. "ఎక్కడికి వెళుతున్నావమ్మా!" అన్న రవి మాటలకి సమాధానం చెప్పకుండానే కళ్ళు మూసింది వసంత. మంచానికి తల కొట్టుకుంటున్న శ్రీధర్‌ని ఆపడం కష్టం అయింది.

ముందుగా ఇచ్చిన టెలిగ్రాములకి తెల్లారేసరికి అందరూ వచ్చారు. వేణుగోపాల్ అన్ని కార్యక్రమాలూ పూర్తిచేశాడు. "ఆ రాస్కెల్‌ని నా చెల్లెల్ని ముట్టుకోనియ్యకండి" అని గోలపెట్టిన శ్రీధర్‌ని బలవంతంగా లోపల పెట్టి తలుపు వేసేశారు. మూడో రోజున వేణుగోపాల్ వెళ్ళిపోయాడు, మిగతావన్నీ అక్కడే చేస్తానంటూ.

"వెధవ... కాదు... కాదు!" — "వెడితాడు. వాడు చేసేవేమీ నా చెల్లెలికి అందవు. వీడు పెద్దయ్యాక అన్నీ వీడిచేత చేయిస్తాను. అందాకా దాని పేర బ్రాహ్మలకి భోజనం పెట్టిస్తాను" అన్నాడు శ్రీధర్.

** ** **

అదృష్టమో, దురదృష్టమో కానీ భారతికి ఆ తర్వాత ఇద్దరూ ఆడపిల్లలు పుట్టి పురిటిలోనే



పోయారు. డాక్టరు నెత్తురులో దోషం ఉందని అంది. బంధువులందరూ, "మీ అడపడుచు తన కొడుకుని సరిగ్గా చూడరేమోఅని ఇలా చేస్తోంది" అన్నారు.

భారతి పట్టించుకోలేదు. "పోనీ అలాగే అనుకుందాం. మనకి ఎలాగూ ఒకమ్మాయి ఉంది. వీడు మన కొడుకు అనుకుందాం" అంది శ్రీధర్‌తో.

"మేనత్త కొడుకే గదా, పెద్దచేసి పెళ్ళిచేస్తే సరి" అని కూడా సలహా ఇచ్చారు కొందరు.

చిన్నప్పట్నుంచీ ఒక్కలా పెరగవలసిన వాళ్ళు, అలాంటి అసహ్యమైన భావాల్తో పెరగడం అతనికి ఇష్టంలేదు.

"పెద్దయ్యాక తల్లీ తోడుగా ఉంటారు. దానికి మాత్రం అన్న కావద్దూ. మన ఆడపిల్లలకి అన్న అండ చాలా అవసరం" అంది భారతి శ్రీధర్‌తో భావగర్భితంగా.

"వద్దు భారతీ! అలాంటి పోలిక తేకు. ఏ అన్నకీ నాలాంటి ఘోరమయిన అనుభవం వద్దు. వాళ్ళిద్దరూ సవ్యంగా ఉండాలి" అన్నాడు శ్రీధర్.

భారతి రవిని కన్న కొడుకుకన్నా ఎక్కువగా చూసుకుంది. చుట్టుపక్కల పిల్లలని చూసి మమ్మీ, డాడీ అంటూ అలవాటు చేసుకున్నారు అమ్మ, నాన్న అనమంటే వినకుండా. కొన్ని సంవత్సరా లయ్యాక రవి తమ కొడుకు కాదనే విషయమే మరిచిపోయారు వాళ్ళు. తాము అనుకున్నట్టుగానే నీరజని, రవిని తీర్చి దిద్దుకోగలిగారు.

వయసొచ్చాక తెలియవలసిన విషయాలన్నీ రవికి తెలియజేశాడు శ్రీధర్. అంతా విని తల్లిని తలుచుకుని ఏడ్చాడు రవి.

"అమ్మకి నేనెందుకూ పనికిరాకుండా పోయానని బాధగా ఉంది. నాకోసమన్నా బతకలేక పోయిందా అమ్మ!" అని బాధపడ్డాడు.

"నీకు తెలియదురా దానికెంత షాక్ తగిలిందో? అవమానం భరించలేకపోయింది. ఇంకా నా గుండెలో మండుతూంది రవీ! కళ్ళముందు అది అలా కావాలని ప్రాణాలు తీసుకుంటుంటే...అవన్నీ గుర్తుచేసుకోవద్దు ఇప్పుడు-వదిలెయ్యి" అన్నాడు బాధగా.

వేణుగోపాల్ తిరిగి మళ్ళీ అటు చూడలేదు. కనీసం రవి ఎలా ఉన్నాడన్న సంగతి కూడా పట్టించుకోలేదు. చెల్లెలి మాటలు గుర్తుకు వచ్చాయి శ్రీధర్‌కి. "జంతువుల్లో కూడా ఆడది గుడ్లు పొదుగుతుంటే మగది సాయంగా ఉంటుంది. పిల్లలయ్యాక కూడా కొన్నాళ్ళు వాటికోసం తాపత్రయ పడుతుందిట, ఆడదానితోపాటు. నోరు, మెదడు లేని జంతువులు అవి. వాటిపాటి చేసుకోలేకపోయాడు వీడు" అని బాధపడేది.

భారతికి, శ్రీధర్‌కి పిల్లలిద్దరితో రోజులు హాయిగా గడిచిపోతున్నాయి. రవి ఇంజినీరింగ్ పాసయ్యాడు. భారతి అమెరికాలో ఉన్న తన అన్నగారి ద్వారా అక్కడ చదవడానికి స్కాలర్‌షిప్ సంపాదించింది రవికి. వాళ్ళకి ఒక అమ్మాయి ఉంది. అమ్మమ్మ దగ్గర ఉండి బి. కామ్. చదువుతోంది. రవి చదువు పూర్తి కాగానే, మేనకోడలితో పెళ్ళి జరిగేటట్టుగా కూడా భారతి అన్నగారితో నిర్ణయాలు చేసేసుకుంది. శ్రీధర్ కేకలేస్తాడని వస్తున్న ఏడుపుని ఆపుకుంటున్న భారతిని వదలలేక వదలలేక బొంబాయి వెళ్ళే రైలెక్కాడు రవి.

** ** **

ఆఫీసునుంచి వచ్చి బల్లమీద ఉన్న ఉత్తరాలు చూస్తున్నాడు శ్రీధర్. అపరిచితమైన రాతతో ఉన్న కవరు తెరిచి చూశాడు. చదువుతున్నకొద్దీ అతనిలో ఆవేశం పెరిగింది.

"భారతీ, ఈ ఉత్తరం చదివావా?" అన్నాడు గట్టిగా.

లోపల్నించి వస్తూ, "ఊఁ..." అంది నెమ్మదిగా.

"చింపి పారెయ్యలేకపోయావా?" మాట్లాడలేదు భారతి. వేణుగోపాల్ దగ్గర్నుంచి ఆ ఉత్తరం.

"మన ఎడ్రస్ ఎలా తెలిసిందంటావు?"

"అదేమంత బ్రహ్మాండం? ఎవరి ద్వారానో సంపాదించి ఉంటాడు. అవసరం వస్తే సరి, అన్ని సులువులూ దొరుకుతాయి" అంది నిష్ఠురంగా. "ఇన్నేళ్ళకి మనం గుర్తు వచ్చామన్న మాట. తన కొక కొడుకు ఉన్న విషయం కూడా గుర్తు ఉందన్న మాట. ఏదో పెంచి పెద్దచేసి హక్కున్న వాడిలా రాశాడు."

రవి తమవాడు కాదంటే ఇద్దరూ భరించలేరు.

"నాన్సెన్స్! వాడి కొడుకు అనడానికి నోరెలా వచ్చింది? ఆ రోజుల్లో నాకు వయసు లేదు- అనుభవం లేదు- ఆ బాధలో ఏం చెయ్యాలో తెలియక ఊరుకున్నానుగానీ, ఇన్నాళ్ళయ్యాక ఊరుకుంటానా? దాని బలవంతపు చావుకి నేనింకా బదులు తీర్చుకోలేదు. ఏదో చేస్తేనేగానీ నాకు శాంతి ఉండదు."

"మీరు వెళ్తారా అయితే?"

"వెళ్దామనే అనుకుంటున్నాను. ఇన్నాళ్ళకి అతనే అవకాశం ఇస్తున్నాడు. నాలుగూ కడిగేసి వస్తాను."

"ఊరికేనే మాటా మాటా పెంచుకోకండి. ఇన్నాళ్ళైపోయాక ఇప్పుడెందుకు?"

మళ్ళీ ఉత్తరం చదివాడు. వేణుగోపాల్ ఆరోగ్యం బాగులేదు- డాక్టర్లు అనుమానంగా చెప్తున్నా


"రుబ్బుడు రోలు రుబ్బుడు రోలే"

ఐనప్పటికీ మీరు క్రొత్త సిపిసి ప్రీమియర్
వెట్ గ్రైండరును యింతవరకు చూచివుండలేదు గదా



తిన్నని విధమైన గ్రైండరు



వంచే విధమైన గ్రైండరు

మీరు చెప్పేది ఒక విధంగా నిజమే కూడా—మూడు పంతుల వెట్ గ్రైండర్లలో, పిండి రుబ్బితే, రుబ్బుడు రోలులో రుబ్బిన మాదిరిగా రాదు - సిపిసి ప్రీమియర్‌లో తప్పింవి.

అతి పరామరికతో తయారు చేయబడ్డ యిది, మీ సకల విధములైన అవశ్యకతలను దృష్టిలో వుంచుకొని రూపొందించబడింది.

బాగా ఎక్కువ బరువును భరించగల శక్తివంతమైన బాల్ బేరింగు, సులువుగా కక్కు అరిగిపోని దారుఢ్యమైన రుబ్బుడు పత్రం, దీర్ఘకాలం సేవ చేయ అదాయకరమైన సిపిసి ప్రీమియర్ మోటారు, దృఢమైన ఎవర్‌సిల్వర్ బేసిన్, క్రోమియం పూత పూయబడిన భాగములు, సులువుగా శుభ్రం చేసుకొనేందుకు అందమైన బాడీ, కదలకుండా నిశ్చలంగా వుండగలందులకు గొట్టములతో నిర్మించబడ్డ కాళ్ళు. వీటిని పొందివున్నవి సిపిసి ప్రీమియర్ గ్రైండర్లు.

వీటన్నిటికన్నా మిన్నగా: ఒక సంవత్సరం గ్యారంటీ.
కోయంబత్తూరు, మద్రాసు, మదురై, తిరుచ్చి, విల్లుపురం, కొచ్చిన్, చిత్తూరు, సికిందరాబాదు, బెంగుళూరు మొదలగు పట్టణాలలో గల మా కంపెనీ శాఖలలోనూ, మరితర ప్రాంతములలో మాచే అంగీకరించబడ్డ వ్యాపారులందరి వద్ద లభించగలవు.

సిపిసి | ప్రీమియర్

నూతన వసతులు, పురాతన పక్వము సమన్వయంగా ఒనగూడినది.

OBM-9365 TG

సిపిసి (పి) లిట్
కోయంబత్తూరు-641 030.

రు. కొడుకుని తీసుకుని రమ్మని రాశాడు. ఆవిడచేత రాయించాడేమో, కింద సంతకం పెట్టాడు. "అంత దిగజారిపోయిందా పరిస్థితి? తప్పకుండా వెళ్ళి చూడాలి" అనుకున్నాడు కసిగా.

రైలు దిగి హోటల్‌లో రూమ్ తీసుకున్నాడు. ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాడు అడ్రెసు ప్రకారం. తలుపు తీసిన ఆవిడ మనిషి మారింది కానీ, మొహంలో పోలికలు కనిపించాయి.

"నేను శ్రీధర్‌ని. వేణుగోపాల్ ఉత్తరం అందింది" అంటుంటే, "రండి...లోపలికి" అంది కంగారుగా.

"ఇంట్లోనే ఉన్నారా?"

"లేరు. ఆస్పత్రిలో చేర్పించాము. రెండు వారాలవుతోంది."

"ఆస్పత్రి ఎక్కడో చెప్తారా?"

"ఇదిగో- నేను అక్కడికే వెళ్తున్నాను. ఇక్కడికి దగ్గరే. నడిచే వెళ్దాము. కూర్చోండి ఒక్క నిముషం" అంది.

"ఫరవాలేదు. బయట నిలబడతాను" అని వరండాలో నిలబడ్డాడు. ఆ ఇంట్లో నిలబడటం అతని తరం కాదు. బాధగా కళ్ళు నలుపుకున్నాడు. ఆవిడ తాళం పెట్టి, "ఒక్కరే వచ్చారా?" అంది భావగర్భితంగా.

"అవును" అన్నాడు కావాలనే, పొడిగా. పది నిమిషాల్లో ఆస్పత్రి చేరుకున్నారు. మంచం మీద ఉన్న వేణుగోపాల్ నిజంగానే మనిషి పాడయిపోయాడు. అతణ్ణి అలా చూస్తుంటే అదొక రకమైన పైశాచికానందం కలిగింది శ్రీధర్‌కి.

"వచ్చావా శ్రీధర్? ఉత్తరం అందిందా?" అన్నాడు.

"రాత్రే వచ్చాను. హోటల్‌లో దిగి ఇప్పుడే ఇంటికి వచ్చాను."

ప్రమీల వైపు తిరిగి, "మందులు తెచ్చావా? డాక్టరు చూసి వెళ్ళాడు ఇందాకే. పిల్లలు కాలేజీకి వెళ్ళారా?" అని అడిగాడు.

"ఆc... పెద్దది తొందరగా వచ్చేస్తానంది. చిన్నదిమాత్రం సాయంత్రందాకా రాదట. ఇప్పటికే చాలా రోజులు స్కూలు పోయింది దానికి."

"ఓహో! ఇద్దరమ్మాయిలన్న మాట!" అనుకున్నాడు శ్రీధర్.

"ఒక్కడివే వచ్చావా?" అన్నాడు వేణుగోపాల్.

"అదే నేనూ అడిగాను. ఉత్తరంలో స్పష్టంగా రాశాము కూడాను. ఇలాంటప్పుడు కాకపోతే ఇంకెప్పుడు? తెంచుకుంటే తెగిపోయే బంధమా? అయినా ఇదే సమయం ఋణం తీర్చుకోవడానికి శాస్త్రప్రకారం. కొడుకెందుకు మరి? డాక్టర్లు ఆ మాట చెప్పిన దగ్గర్నుంచీ ఒకటే కలవరిస్తున్నారు, ఆయన అబ్బాయికోసం. ఆ రోజు మరి ఆవిడకోసం ఈయన పరుగెత్తుకు రాలా?" అంది కళ్ళు ఒత్తుకుంటూ ప్రమీల.

ఒక్కొక్క మాటా శ్రీధర్‌కి కత్తిపోట్లలా ఉన్నాయి. ఆన్నేళ్ళ కసి, ద్వేషం, అతను ఎక్కడో మనసు పొరల కింద అదిమి ఉంచాడు. ఈవిడ మాటలతో అవన్నీ చిరిగి, బాధంతా పైకి వచ్చేస్తోంది. అన్నీ కలిపి ఛీత్కారంగా అన్నాడు:

"చూడమ్మా! ఇన్నేళ్ళలో శాస్త్రాలు, ధర్మాలు బాగానే నేర్చుకున్నట్లున్నావు. తెగిపోయే బంధం కాదా అది? మరి ఏ శాస్త్ర ప్రకారం నా చెల్లెలి కాపురాన్ని కూలదోసి ఆ బంధాన్ని తెంచేశావు? దాని చితి మంటల్లో నీ కాపురాన్ని వెలిగించుకున్నావు. ఋణం తీర్చుకోవాలా? ఏ ఋణం? మూడేళ్ళ పసివాడిని అర్ధాంతరంగా వదిలేసినందుకా? వాణ్ణి కనడంలో మీ ఆయన పడ్డ కొన్ని నిమిషాల శ్రమకా? ఏ ఋణం తీర్చుకోమంటావు? నా చెల్లెలి కోసం పరుగెత్తుకువచ్చాడా? మీ ఇద్దరూ కలిసి కదా ఆ పరిస్థితులు కల్పించింది?..." ఇంకా ఏదో అనబోతుంటే-"ఉష్! గట్టిగా అరవకండి. ఇది ఆస్పత్రి" అంది.

"నీ దయవల్ల నా చెల్లెలి కోసం రెండేళ్ళు ఆస్పత్రి చుట్టూ తిరిగాను. రేప్పొద్దున్న నీ కూతురికి అటువంటి పరిస్థితి వస్తే నెమ్మదిగా నవ్వుతూ మాట్లాడుతూ ఉంటే నన్ను పిలు. నేను చూస్తాను." అతను మాటల్లో విషం కక్కుతున్నాడు. వేణుగోపాల్ కల్పించుకున్నాడు.

"ఇలా రా శ్రీధర్. ఎందుకు ఘర్షణ పడటం? నీకు కొన్ని మాటలు చెప్పాలి. ఏ రోజున ఎలా ఉంటానో తెలియదు" అంటూ తల కింద నుంచి కాగితాలు తీసి, "చూడు. మానాన్న ఆస్తి కొంత నాకూ వచ్చింది. అది న్యాయంగా పొందే హక్కు వాడికుంది. నా తరవాత వీళ్ళు ఇబ్బంది పడిపోకుండా కొంత వాళ్ళకి ఉంచి, మిగతాది వాడికి రాశాను. అలాగే వాడి చేత తలకొరివి పెట్టించుకునే హక్కుకూడా నాకుంది మరి. ఆ మాటలు శ్రీధర్‌నిలోని సహనాన్ని తెంపేశాయి. అతనికి రక్తనాళాలు చిట్లిపోతాయేమో అన్నంత ఆవేశం వచ్చింది.

"ఇంక చాలు. ఈ ఆస్తి వాడి హక్కా? ఏ హక్కుల గురించి మాట్లాడుతున్నావు? పదిమంది ముందరా చేసుకున్న నా చెల్లెలికి భార్యగా ఏ హక్కులిచ్చావు? బతికుండగానే ఎవత్తెనో తెచ్చి దాన్ని మింగేశావు. కొడుకుగా వాడు ఏ హక్కులు పొందగలిగాడు ఇన్నాళ్ళూ? అర్ధరాత్రి అమ్మ కోసం ఏడిస్తే వంతులు వేసుకుని భుజంమీద మోశాము. నిద్రలో జడుసుకుంటాడని గుండెమీద పడుకోబెట్టుకుని పెంచాను వాడిని. మంచికీ, చెడుకీ ఒక్కలా నిలబడ్డాను. ఎక్కడున్నాడు ఈ తండ్రి అప్పుడంతా? నీ బాధ్యత నువ్వు నెరవేర్చావా వాడిమీద హక్కు సంపాదించడానికి? కన్నతండ్రిట! వీధిలో పందులుకూడా కంటాయి అలాగయితే. తల్లి ఎవరో పిల్లవాడికి పుట్టిన వెంటనే తెలుస్తుంది. కానీ, తండ్రి తన ప్రేమతో, చనువుతో, బాధ్యతతో తనే తండ్రి అని తెలియజేసుకుంటాడు. అంతేగానీ నువ్వు పడ్డ కొన్ని నిమిషాల శ్రమకి కన్నతండ్రివి అయిపోవు. చావు దగ్గర పడుతోందని వాడు గుర్తు వచ్చాడా? వాడిచేత కొరివి పెట్టించుకొని పుణ్యలోకాలకి పోదామనుకుంటున్నావు కాబోలు. నీ అంతట నువ్వు పెట్టుకున్నా నిన్నక్కడ అడుగు పెట్టనివ్వరు తెలిసిందా? ఏ మొహంతో నా కొడుకుని తెమ్మని రాశావో అడుగుదామనే వచ్చాను. అయిపోయింది. ఈ డబ్బు నీ కర్మకి ఖర్చు పెట్టుకో" అంటూ కాగితాలు పరపర చింపి పారేశాడు.

తను వాడుతున్న భాష సవ్యమైనది కాదని తెలుసు. కానీ, ఆ పరిస్థితుల్లో అవే వస్తున్నాయి నోటమ్మట. ప్రమీల కోపంగా ఏదో అనబోయింది. గుమ్మం దగ్గరకి వెడుతున్న శ్రీధర్ ఆగి, "ఇంకేం మాట్లాడకమ్మా. నీకు కొడుకులు లేరేమిటి లంచం ఇచ్చి వాడిని పిలిపించుకుందామనుకున్నావు? ఉత్తరాలవీ రాసి కబురు తెలియపరచడానికి ప్రయత్నించద్దు. వాడు రాడు. ఎందుకో తెలుసా? వాడు అమెరికాలో ఉండి చదువుకుంటున్నాడు. మీ మాట ఎత్తితే తననే కాదు, చచ్చిపోయిన వాళ్ళ అమ్మనికూడా అవమానపరిచినట్లని వాడు అంటాడు- తెలుసా? లక్షణమైన పిల్లని చూశాను. పీటల మీద కూర్చుని పెళ్ళి చేస్తాము. వాడిచేత తండ్రిగా కొరివి పెట్టించుకునే హక్కు ఎవరికన్నా ఉందంటే అది నాకు! అర్థమయిందా? కోర్టుకు వెళ్ళదామని సరదా ఉంటే పదండి. నాకూ తీరికే ఇప్పుడు. మళ్ళీ నాతో ఏ విధంగానూ సంప్రదించడానికి ప్రయత్నం చెయ్యద్దు. తెలిసిందా?" అని ఆ మొహాల్లోకి ఛీత్కారంగా చూసి గబగబా వెళ్ళిపోయాడు.

గుమ్మం దిగేసరికి అంత ఆవేశమూ మాయమయిపోయి శరీరం, మనస్సుకూడా ఎంతో తేలికయినట్లయింది. అవును మరి, ఇరవై ఏళ్ళ నుంచీ దాచుకున్న మంట ఈ రోజు చల్లారింది!

★

